క్లుప్తంగా

అత్యాచారాలు అరికట్టాలి



ఫ్లాష్ మాబ్ నిర్వహిస్తున్న విద్యార్థినులు

చీపురుపల్లి: అమ్మాయిలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు మాట్లాడుతూ.. ఆడపిల్లలపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆడపిల్లలను గౌరవించేలా మగ పిల్లలను పెంచాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వంశీ మాట్లాడుతూ ఈ నెల 28,29,30 తేదీల్లో జిల్లా కేంద్రంలోని గురజాడ కళాక్షేత్రంలో భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రమణ, రూప, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువుకోవాలి

గంట్యాడ: విద్యార్థులు ప్రణాళికతో చదువుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్ వద్ద ఉన్న కేజీబీవీని శనివారం ఆయన సందర్శించారు. వంటగది, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మాట్లాడారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఇప్పటి నుంచే ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. వసతి గృహంలోకి కుటుంబ సభ్యులు తప్ప ఇతరులను అనుమతించొద్దని నిర్వాహకులకు సూచించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, తదితరులు ఉన్నారు.

నగదు ప్రోత్సాహకం అందజేత

దత్తిరాజేరు: విద్యార్థులు బాగా చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని జేసీ సేతు మాధవన్ అన్నారు. మండలంలోని పోరలి గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి కూర్మారావు కర్ణాటకలో కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయన విద్యనభ్యసించిన దత్తిరాజేరు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏటా నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులకు శనివారం జేసీ సేతుమాధవన్ చేతులమీదుగా నగదు ప్రోత్సాహకం అందజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చీపురుపల్లి: పట్టణంలోని రామాంజనేయ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను జిల్లా ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు పద్మలత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ అమలు చేస్తున్నారో లేదో పరిశీలించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారని విద్యార్థులు చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం కంది గోపి, తదితరులు ఉన్నారు.

కబడ్డీలో డీవీఎల్ స్కూల్ విద్యార్థుల సత్తా

శృంగవరపుకోట: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) నిర్వహిస్తున్న అండర్–17 క్రీడా పోటీల్లో స్థానిక వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల గద్వాల్‌లో నిర్వహించిన క్లస్టర్ 7 అంతర్‌రాష్ట్ర కబడ్డీ పోటీల్లో డీవీఎల్ స్కూల్ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకం సాధించిన విద్యార్థులతో పాటు పీఈటీ గొర్లె రామును పాఠశాల వ్యవస్థాపకులు కె.రాజేంద్రప్రసాద్, హెచ్ఎం వై.జానకీదేవి శనివారం అభినందించారు.

అధ్యాపకుడు మృతి

కొత్తవలస: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తివిద్య అధ్యాపకుడిగా పనిచేస్తున్న వియ్యంపేట గ్రామానికి చెందిన పులిబంటి జగన్నాథం శనివారం మృతి చెందారు. గ్రామంలో పంట పొలాన్ని చూసేందుకు తెల్లవారు జామున వెళ్లగా అక్కడ పొలం గట్టుపై అచేతనంగా పడి ఉన్న జగన్నాథంను స్థానికులు చూసి హుటాహుటిన కొత్తవలస ఆస్పత్రికి ఆటోలో తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. కాగా మృతుడుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి భీమశంకరరావు, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, పలువురు అధ్యాపకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మొక్కల పంపిణీ

వేపాడ: అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందిన తండ్రి జ్ఞాపకార్థం తనయులు 300 మొక్కలు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన వేపాడ గ్రామానికి చెందిన ఈగల రాజబాబు ఆకస్మికంగా మృతిచెందారు. రాజబాబు తనయులు అప్పారావు, ముత్యాలునాయుడు తండ్రి జ్ఞాపకార్థం 200 జామి, 100 సపోట మొక్కలను శనివారం పంపిణీ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

వంద రోజుల్లో ప్రజలకు చేసింది శూన్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- హామీలు అటకెక్కించి మరోసారి ప్రజలకు మోసం
- వంద రోజుల్లో దాడులు, కక్ష సాధింపులు, ఉద్యోగుల తొలగింపులు
- కూటమి పాలనపై వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ధ్వజం

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ఏ ముఖం పెట్టుకుని ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు అటకెక్కించి మరోసారి ప్రజలను మోసం చేసినందుకా 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో దోచుకోవడం, కక్ష సాధింపులు, చిరు ఉద్యోగులు తొలగింపు, అబద్ధాలు పరిపాలన తప్ప ఇంకేమీ లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రస్తుత సీఎం చంద్రబాబుకు ఎంతో తేడా ఉందన్నారు. 2019లో ముఖ్యమంత్రి అయిన జగన్ మోహన్‌రెడ్డి వంద రోజుల్లో సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి 1.3 లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని, 2.6 లక్షల మందికి వలంటీర్లుగా నియమించారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు 50 వేల పోస్టులతో మెగా డీఎస్సీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక 16 వేల పోస్టులతో డీఎస్సీ ఫైలుపై సంతకం చేశారని, ఆ పోస్టులు కూడా వచ్చే ఏడాది భర్తీ చేస్తామని నిరుద్యోగులను మోసం చేసారన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే విజయవాడలో 50 మంది ఆకలితో మృత్యువాత పడగా, 2 లక్షలు మంది రోడ్డున పడాల్సి వచ్చిందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ యంత్రాంగం ముందుగానే హెచ్చరించినప్పటికీ చంద్రబాబు పట్టించుకోకపోవడంతోనే ఆ పరిస్థితి ఏర్పడిందని, అదంతా పక్కన పెట్టి చంద్రబాబు ప్రచారం కోసం తాపత్రయం పడ్డారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షలు ఫించన్‌లు నిలిపివేశారని, అక్టోబర్ నుంచి మళ్లీ పింఛన్లు వెరిఫికేషన్ పేరుతో మరెన్ని లక్షలు పింఛన్లు నిలిపివేస్తారో తెలియదన్నారు. ఇసుక ఉచితంగా ఇస్తానని చెప్పిన బాబు డబ్బులు చెల్లించినా ఇసుక దొరకని స్థితికి తీసుకొచ్చారన్నారు. ఇటీవల జిల్లాలో వరదలు కారణంగా కురుపాం, పార్వతీపురం ప్రాంతాల్లో రహదారులు పాడై రవాణా నిలిచిపోయినప్పటికీ జిల్లాలో మంత్రులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా డబ్బాలు కొట్టుకోవడం మాని ప్రజలకు సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, గొర్లె శ్రీరాములు, గిరడ రాందాసు, ముల్లు పైడిరాజు, గవిడి సురేష్, కోరుకొండ దాలయ్య, రేవల్ల సత్తిబాబు, కరణం ఆది, వాసు పాల్గొన్నారు.

ఇది రెడ్‌బుక్ ప్రభుత్వం

- సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మోసం
- కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ధ్వజం



గజపతినగరం: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారనే ఉద్దేశంతో ప్రజలు కూటమి పార్టీలకు ఓట్లేసి అధికారం ఇస్తే.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విమర్శించారు. గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో సమావేశమై మాట్లాడారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, చెప్పుకోడానికి ఏమీ లేకపోయినా 'ఇది మంచి ప్రభుత్వం' అని చెప్పుకోవడం, ఇంటింటా ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని ధ్వజమెత్తారు. ఇది రెడ్‌బుక్ ప్రభుత్వం అని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం, ఆ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి ఏవిధంగా జైలుకు పంపించాలనే ఆలోచనలతోనే వంద రోజుల పాలన సాగింది తప్ప ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేపట్టిన దాఖలాలు లేవని మండిపడ్డారు. బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తూ ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేసేందుకు కంకణం కట్టుకుందని దుయ్యబట్టారు. పవిత్రమైన తిరుపతి లడ్డూను రాజకీయం చేయడం సరికాదన్నారు. దీనిపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు దమ్ముంటే దీనిపై సీబీఐ ఎంక్వైరీ వేయాలని సవాల్ విసిరారు. తిరుపతి లడ్డూ నాణ్యత ఆరోపణలపై అప్పటి చైర్మన్‌గా ఉన్న సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వెంకన్న సాక్షిగా ప్రమాణం చేస్తామని చెప్పారని, చంద్రబాబుకు ధైర్యం ఉంటే కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతి వెంకన్న స్వామిని రాజకీయంలోకి తీసుకొచ్చిన బాబుకు ఆ పాపం ఊరికే పోదని ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు పచ్చపత్రికలను అడ్డం పెట్టుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ చేసిన మోసాలపై సిటింగ్ జడ్జితో విచారణ చేయించి ప్రజలకు క్లారిటీ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వందరోజుల పాలనలో ప్రజలకు ఒక్క మంచిపని అయినా కూటమి ప్రభుత్వం చేయలేదని, అమ్మకు వందనం అని చెప్పి ఈరోజు అమ్మకు శఠగోపం పెట్టారని ఎద్దేవాచేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గుర్ల: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఆరుద్ర సూచించారు. మండలంలోని కెల్ల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు.

గంట్యాడ: గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని జెడ్పీ స్టాండింగ్ కమిటీ(స్త్రీ,శిశు సంక్షేమ) చైర్మన్ శాంతికుమారి అన్నారు. మండలంలోని కొఠారుబిల్లిలో టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. కిశోర బాలిక దశ నుంచి పోషకాహారం తీసుకుంటే రక్తహీనత బారిన పడకుండా ఉంటారన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవాలన్నారు.



చీపురుపల్లి రూరల్(గరివిడి): అర్తమూరులో పౌష్టికాహార వారోత్సవాలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): పౌష్టికాహారం తీసుకోవటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు ఎం.సుబ్బలక్ష్మీ, ఎం.జ్యోతి అన్నారు. గరివిడి మండలం అర్తమూరు, ఐతాంవలస అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రెజ్లింగ్‌లో కాపుశంబాం విద్యార్థినుల సత్తా

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంబాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రఘుమండ అనూష, ఇప్పిలి జెనీలియా, పొన్నాడ భవానీ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొండవెలగాడలో జరిగిన జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం డి.రాము, పీడీ ఎం.ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వరద బాధితులకు అండగా..

శృంగవరపుకోట: విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు ఎస్.కోట మండలం కొట్టాం గ్రామానికి చెందిన యువత ముందుకొచ్చారు. ఈ క్రమంలో గ్రామస్తుల నుంచి 40 వేల రూపాయలు సేకరించి, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో గొరవల్లి ఈశ్వరరావు, వేచలపు మహేష్, తగరంపూడి సన్యాసిరావు, గుర్రపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సాయం

వేపాడ: వరద బాధితుల సహాయార్థం మండలంలో సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సేకరించి విరాళాలను పాఠశాల ఉపాధ్యాయులు రవిశంకర్, సీఆర్పీ రాంప్రసాద్, కేజీబీవీ హిందీ టీచర్ అనురాధ శనివారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి అందజేశారు. వరద బాధితుల కోసం విద్యార్థులు రూ.6 వేలు, ఉపాధ్యాయులు రూ.6 వేలు సేకరించారు. వాటిని ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసినట్లు హెచ్ఎం బీపీప రాజు తెలిపారు.

ఉపాధ్యాయుల సాయం

శృంగవరపుకోట: మండలంలో వెంకటరమణపేట గ్రామానికి చెందిన గేదెల కృష్ణ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. దీంతో ఆయన భార్య, ఆర్నెళ్ల వయసున్న ఇద్దరు కవల పిల్లలు అనాథలు అయ్యారు. వారి పరిస్థితిని చూసి చలించిన గొల్జాం ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.సుందర్శన్, ఉపాధ్యాయులు, సిబ్బంది రూ.13,600 సేకరించి శనివారం మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ-పంట నమోదుతో రైతులకు మేలు



దెందేరు సమీపంలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

కొత్తవలస: మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలను ఈ–పంటలో నమోదు ప్రక్రియ కొనసాగుతోందని మండల వ్యవసాయాధికారి మాధురీశరణ్య శనివారం తెలిపారు. రైతులు తాము సాగు చేస్తున్న పంటలను 23వ తేదీలోగా ఈ–పంటలో నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ–పంటలో నమోదు చేసిన పంటలకు మాత్రమే బీమా వర్తిస్తుందని, ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు పంటను విక్రయించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2014 ఎకరాల్లో వరి పంటను సాగులో ఉండగా, ఇప్పటివరకు 1920 ఎకరాల్లో పంటను ఈ–పంటలో నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. దత్తి గ్రామంలో శనివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకుడు బోడసింగి సత్తిబాబు మాట్లాడుతూ గ్రామంలో సారవగెడ్డ వద్ద మినీ రిజర్వాయర్ నిర్మించాలని, గ్రామంలో సోషల్ వెల్ఫేర్ కోసం కేటాయించిన ఐదెకరాల భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలని ఇవ్వాలని మంత్రిని కోరారు. టి.భూర్జవలస గ్రామంలో నిత్యం విద్యుత్ సమస్య వేధిస్తోందని, సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరిది దుర్గాప్రసాద్ కోరారు. గ్రామస్తులు చెప్పిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సమక్షంలో గుచ్చిమి గ్రామ సర్పంచ్ కడుబండి సూర్యనారాయణతో పాటు మరో పది మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, జనసేన మండల అధ్యక్షుడు చప్ప అప్పారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వంద రోజుల పాలనపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొండపల్లి

కొత్తబగ్గాం వెల్‌నెస్ కేంద్రం పరిశీలన



కొత్తబగ్గాం వెల్‌నెస్ కేంద్రం వద్ద టాస్క్‌ఫోర్స్ బృందం, సిబ్బంది

గజపతినగరం: గర్భిణులు, బాలింతలకు నెలవారీ రక్త పరీక్షలు చేయాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ ఎస్‌ఓ డి.ధర్మారావు సూచించారు. కొత్తబగ్గాం గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. బడి బయట ఉన్న పిల్లలకు, అంగన్‌వాడీ, స్కూల్ పిల్లలకు నిర్వహించిన రక్తపరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు, బాలింతలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌ఓ సత్యవతి, డీపీఓ జి.రామాంజులనాయుడు, డీడీఎం ఏబీ శ్రీనివాస్ పాల్గొన్నారు.


అభ్యుదయ కవికి నివాళి



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నీలకంఠరావు, సిబ్బంది

అభ్యుదయ కవి గురజాడ చూపిన బాటలో అందరం పయనిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. గురజాడ వేంకట అప్పారావు జయంతిని వాడవాడలా శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రచనా శైలిని పలువురు వివరించారు. సమాజంలోని వివక్షతను తన రచనల ద్వారా చీల్చిచెండాడిన ధీరుడని కొనియాడారు.

– కొత్తవలస/లక్కవరపుకోట/మెరకముడిదాం/ఎస్.కోట



లక్కవరపుకోట: జ్యోతీబాపూలే ఆదర్శ పాఠశాలలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో



మెరకముడిదాం: భైరిపురం జెడ్పీ పాఠశాలలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ధర్మవరం ఉన్నత పాఠశాలలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గజపతినగరంలో భారీ వర్షం



వర్షపు నీటితో నిండిన గజపతినగరం-మెంటాడ జంక్షన్ రోడ్డు



పురిటిపెంట గ్రామ పంచాయితీలో చేరిన వర్షపు నీరు

గజపతినగరం: గజపతినగరంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాలువలు, రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్, మెంటాడ జంక్షన్, పురిటిపెంట బాలాజీనగర్ రోడ్డుతో పాటు వేంకటేశ్వర ఆస్పత్రి, సంతోస్ స్టీల్ ట్రేడర్స్ షాపుల్లో నీరు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సంక్షిప్తంగా...

శతశాతం టీకాలు అందించాలి

జామి: గర్భిణులకు, చిన్నారులకు శతశాతం టీకాలు అందించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మీ అన్నారు. స్థానిక అల్లువీధి కేంద్రంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ శిబిరాన్ని శనివారం ఆమె పరిశీలించారు. టీకా తీసుకోవడం వల్ల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. గర్భిణులు హెచ్‌బీ పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్‌వీ భవాణీ, ఏఎన్ఎం భూలక్ష్మీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రామలింగాపురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులకు సంబంధించి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. 1బీలు మంజూరు కాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా రైతుల సమస్యపై దృష్టి సారించకపోవడం దారుణమన్నారు.

నేడు సుపథ ప్రతిభా పరీక్షలు

లక్కవరపుకోట: నేటి విద్యార్థులలో కొరవడుతున్న మానవతా విలువలు, మాతృభాషా విలువలు, సంస్కృతీ సాంప్రదాయ విలువల పరిరక్షణలో భాగంగా సుపథ సంస్థ 21వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఎ.శ్రీహరిశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు నేర్చుకుందాం, పద్య, శ్లోక, వేద పఠనం, దేశభక్తి గేయాలు, వ్యాసరచన, ప్రహేళిక (క్విజ్) మొదలగు అంశాలపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని 30 పాఠశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మధ్యాహ్నం 3 గంటలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

మండల డీలర్స్ అసోసియేషన్ ఏకగ్రీవం

చీపురుపల్లి: మండల రేషన్ డీలర్ల అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు అసోసియేషన్ అధ్యక్షుడిగా రుంకాన రామారావు, గౌరవ అధ్యక్షుడిగా రాజగోపాల్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా బి.అప్పలనర్సయ్య, కార్యదర్శిగా సావిత్రి, జాయింట్ కార్యదర్శిగా బి.నాగమణి, కోశాధికారిగా పొట్నూరు కామేశ్వరరావు, ఉపకోశాధికారిగా వారణాశి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అసోసియేషన్‌ను తహసీల్దార్ రాజారావు, సీఎస్‌డీటీ రామారావు అభినందించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వేపాడ: వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని కుమ్మపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పిల్లలకు విద్యాబోధన, ఉపాధ్యాయులు హాజరు, లెసెన్ ప్లాన్స్‌పై ఆరా తీశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

వేపాడ: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని వల్లంపూడి ఎస్సై బి.దేవి సూచించారు. మండలంలోని జగ్గయ్యపేట గ్రామస్తులకు సైబర్ నేరాలు, చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ ద్వారా లింకులు పెట్టడం, ఓటీపీలు అడగటం, ఆధార్ నంబర్లు అడిగి మోసగిస్తున్నారని, అటువంటి వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాలని, అపరిచితుల సంచారంపై సమాచారం అందించాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో అనుమతి లేకుండా మద్యం విక్రయించిన, సారా తయారు చేసిన చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.